www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 29 అక్టోబర్ 2025

నేడు పాఠశాలలకు సెలవు
కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం
మొంథా తుపాన్ నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ నెల 29వ తేదీ బుధవారంనాడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలకు, పాఠశాలలకు, అంగన్వాడీలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సెలవు ప్రకటించారు. పిల్లలను బయట తిరగనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. సెలవు ఉత్తర్వులను అన్ని విద్యాసంస్థలు తూచ తప్పకుండా పాటించాలని ఆదేశించారు.



ముంచిన మొంథా

పశ్చిమగోదావరి కంట్రోల్ రూమ్‌ల నెంబర్లు
భీమవరం కలెక్టరేట్ : 08816 299219
భీమవరం ఆర్‌డిఒ కార్యాలయం: 9848413739, 8790731315
నరసాపురం ఆర్‌డిఒ కార్యాలయం: 9391185874
తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం: 9381701036, 9849712358

- తీరం దాటినా వీడని ముప్పు
- ఈదురుగాలులు, వర్షాలతో స్తంభించిన జన జీవనం
- పలుచోట్ల నేలకొరిగిన చెట్లు, ప్రమాదకర స్థాయిలో చెరువులు
- ఏలూరులో 45 పునరావాస కేంద్రాలు, 1203 మంది తరలింపు
- పశ్చిమలో 37 కేంద్రాలు, 4,155 మందికి పునరావాసం
- పశ్చిమ తీర ప్రాంతంలో భయానక పరిస్థితి
- సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
మొంథా తుపాన్ ప్రజలకు, అధికారులకు కునుకు లేకుండా చేసింది. తుపాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి ఈదురుగాలులు, వర్షాలతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. అవసరమైతే తప్ప జనం ఇళ్లు విడిచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో తుపాన్ నరసాపురం-కాకినాడ మధ్య తీరం దాటడంతో ఆ ప్రభావం పశ్చిమ, ఏలూరు జిల్లాలపై ఎక్కువగా కన్పిస్తోంది. తీర ప్రాంతంలో మంగళవారం సాయంత్రానికి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తుపాను నష్టనివారణ, సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం పూర్తిగా నిమగ్నమైంది. పశ్చిమగోదావరి జిల్లాలో తుపాన్ ప్రభావిత 70 ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇప్పటి వరకూ మొత్తం 37 పునరావాస కేంద్రాలకు 4,155 మందిని తరలించి భోజన ఏర్పాట్లు చేశారు. అవసరమైతే మరో 9,409 కుటుంబాలను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నరసాపురం డివిజన్‌లో 6,500 కుటుంబాలు, తాడేపల్లిగూడెం డివిజన్‌లో 1,350, భీమవరం డివిజన్‌లో 1,559 కుటుంబాలను గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే 3,481 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. ఈదురుగాలులకు వరిపొలాలు నేలనంటాయి. భారీ వర్షాలు కొనసాగితే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఏలూరు జిల్లాలో మొత్తం 82 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకూ 20 మండలాల పరిధిలో 45 పునరావాస కేంద్రాలకు 1,203 మందిని తరలించారు. ప్రమాదం పొంచి ఉన్న 120 చెరువులను గుర్తించి చర్యలు చేపట్టారు. కలిదిండి, ముసునూరుల్లోని రెండు చెరువుల్లో ప్రమాదకర స్థాయికి నీరు చేరడంతో తగిన చర్యలు చేపట్టారు. రోడ్డు, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద పికెట్లు ఏర్పాటు చేశారు. టెలికాం సేవలకు అంతరాయం లేకుండా టవర్ల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేశారు.

చలిగాలులు.. వర్షం
తుపాన్ ప్రభావంతో పూర్తిగా చీకటి కమ్ముకున్నట్లుగా మారింది. ఈదురుగాలులు, వర్షాలకు చలి విపరీతంగా పెరిగింది. దీంతో జనం బయటికి రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. చలిగాలులకు ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. రెండు జిల్లాల కలెక్టర్లు అధికార యంత్రాంగంతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులు మరింత దృష్టి సారించాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

50 మీటర్లు ముందుకొచ్చిన సముద్రం..

ప్రజాశక్తి - మొగల్తూరు
మొంథా తుపాన్ ప్రభావంతో సముద్రంలో భారీగా ఎగిసిపడుతున్నాయి. వీటి ప్రభావంతో మండలంలోని పేరుపాలెం, కెపి పాలెం గ్రామాల పరిధిలో సముద్ర తీర ప్రాంతం కోతకు గురవుతుంది. మంగళవారం సముద్ర అలల తీవ్రత అధికంగా ఉంది. 50 మీటర్లు మేర సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. పర్యాటకులు, ప్రజలను బీచ్‌లోకి అనుమతించలేదు.

కోతకు గురైన తీరప్రాంతం

అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం
కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం
జిల్లాలో అధికారులందరూ సమన్వయంతో 24 గంటలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి, తుపాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి వి.ప్రసన్న వెంకటేష్ అన్నారు. జిల్లాలో 200 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో అంతా సర్వ సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. మంగళవారం వారు ఇరువురు, జెసి రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి మొంథా తుపాన్ సహాయక చర్యలపై వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాన్ తీరం దాటాక అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, 200 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, పల్లపు ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉందని హెచ్చరించారు. జిల్లాలో 29 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని, ప్రస్తుతం 19 కేంద్రాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరాల వద్ద తాగునీరు, భోజన సౌకర్యం, పాలు, మెడికల్ క్యాంపు, శానిటేషన్ నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మండలాలకు పంపిన డ్రోన్లను వెంటనే వినియోగించాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మొగల్తూరు: తుపాను బాధితుల పునరావాస కేంద్రాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ మంగళవారం సందర్శించారు. పేరుపాలెంలోని బెల్లంకొండవారి మెరక రైతు భరోసా కేంద్రం, పాతపాడు జెడ్‌పి హైస్కూల్, భీమవరం మండలం నాగిడిపాలెం పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. భోజనం, అల్పాహారం సుచిగా, రుచిగా వేడివేడిగా అందించాలని, రాజీ పడితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదని సిబ్బందిని హెచ్చరించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచేందుకు సిబ్బందిని నియమించాలని, పునరావాస కేంద్రాల ప్రాంగణమంతా ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరిన్ కలిపిన నీటిని సరఫరా చేయాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ, డిపిఒలను ఆదేశించారు. వీరి వెంట ఆర్‌డిఒ దాసి రాజు, మొగల్తూరు, యలమంచిలి తహశీల్దార్లు రాజకిషోర్, జి.పవన్, విద్యుత్ శాఖ ఇఇ మధుబాబు, తదితరులు ఉన్నారు.

మొగల్తూరు : పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉమ్మడి జిల్లాలో పలు రైళ్లు రద్దు
భీమవరం జంక్షన్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి

ప్రజాశక్తి - భీమవరం
మొంథా తుపాన్ నేపథ్యంలో రైల్వేశాఖ పలు రైళ్లు రద్దు చేసింది. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లాలో పలు రైళ్లను గత రెండు రోజుల నుంచి రద్దు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 29న రద్దు చేసిన రైళ్ల వివరాలిలా ఉన్నాయి. భీమవరం-నిడదవోలు (67242), నిడదవోలు-నరసాపురం (67243), నరసాపురం-నిడదవోలు (67244), నిడదవోలు-నరసాపురం (67245), భీమవరం-నరసాపురం (17263) రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఏలూరు జిల్లా మీదుగా వెళ్లే మరికొన్ని రైళ్లను రద్దు చేశారు. విజయవాడ-రాజమండ్రి (67262), విజయవాడ-కాకినాడ పోర్ట్ (17257), 2-రాజమండ్రి (67202), రాజమండ్రి-విజయవాడ (67201), రాజమండ్రి-విజయవాడ (67261), కాకినాడపోర్ట్-విజయవాడ (17258), తిరుపతి-విశాఖపట్నం (08584), విశాఖపట్నం-గుంటూరు (22875), గుంటూరు-విశాఖపట్నం (22876), తిరుపతి-విశాఖపట్నం (22708), హైదరాబాద్-విశాఖపట్నం (12728), మహబూబ్‌నగర్-విశాఖపట్నం (12862), చెన్నై సెంట్రల్-విశాఖ (22870), సికింద్రాబాద్- విశాఖ (12740), భువనేశ్వర్- బెంగళూరు (18463), భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015), భువనేశ్వర్-పాండిచ్చేరి (20851), సికింద్రాబాద్-భువనేశ్వర్ (18464) రైళ్లను రద్దు చేశారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పునరావాస తీరుపై విమర్శల వెల్లువ

వేములదీవి పునరావాస కేంద్రం చుట్టూ వర్షపు నీరు

ప్రజాశక్తి - నరసాపురం
తుపాన్ పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని వేములదీవి వెస్ట్, కాపులకొడప పునరావాస కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకూ భోజనాలు పెట్టకపోవడంతో అక్కడి వారు ఆకలితో అలమటించారు. పునరావాస కేంద్రంలో సరైన సదుపాయాలు కల్పించడం లేదని పలువురు వృద్ధులు ఆరోపిస్తున్నారు. జనరేటర్ ఉన్నా డీజిల్ లేకపోవడం గమనార్హం. ఈ కేంద్రంలోకి ప్రజలు రావాలంటేనే మోకాలు లోతు నీళ్లలో రావాల్సిన పరిస్థితి ఉంది. వేములదీవి తూర్పు పునరావాస కేంద్రంలో ప్రజలకు మధ్యాహ్నం భోజనం పూర్తిస్థాయిలో అందరికీ అందని పరిస్థితి. మంత్రులు రావడంతో నాన్‌వెజ్ భోజనాలు ఏర్పాటు చేశారు. మిగిలిన కేంద్రాల్లో పప్పు, సాంబార్ ఏర్పాటు చేశారు.

ఖాళీ ప్లేట్లతో కూర్చున్న వృద్ధులు

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి : ఎంఎల్‌సి గోపీమూర్తి

పునరావాస కేంద్రం వద్ద వృద్ధురాలికి చేయి అందిస్తున్న ఎంఎల్‌సి

ప్రజాశక్తి - నరసాపురం
మండలంలోని తీరప్రాంత గ్రామాలైన వేములదీవి వెస్ట్, సర్దుకొడప, పెదమైనవానిలంకల్లోని పునరావాస కేంద్రాలను ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి మంగళవారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. తాగునీరు, టాయిలెట్స్, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యం, భోజన వసతి ఏర్పాట్లను ఆరా తీశారు. రాత్రి సమయంలో పడుకోవడానికి ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. పిఎం లంక వద్ద సముద్రపు కోతను పరిశీలించారు. ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, నేతలు ఎం.మార్కండేయులు, ఎస్.అజయ్‌కుమార్, పి.శాంసన్, ఎం.మాణిక్యాలరావు ఉన్నారు.

పిఎంలంకలో సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు : మంత్రి

మొగల్తూరు: ప్రజలకు ఆస్తి, ప్రాణ నష్టాలు లేకుండా చర్యలు చేపట్టామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని పాతపాడు, పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను విప్ బొమ్మిడి నాయకర్, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ కొత్తపల్లి జానకీరామ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తుపాన్ ప్రభావం లేని ప్రాంతాల నుంచి విద్యుత్ శాఖ సిబ్బందిని ఈ ప్రాంతాలకు తీసుకొచ్చామన్నారు.

పునరావాస కేంద్రంలో భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి రవికుమార్

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక కేంద్రీకరణ
జెసి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కాళ్ల
తుపాను నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలవపూడి తుపాన్ పునరావాస కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఎటువంటి అసౌకర్యమూ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భోజన వసతి, తాగునీరు, మరుగుదొడ్లు, శానిటేషన్, జనరేటర్ సౌకర్యం ఉండాలన్నారు. మోడి గ్రామంలో ఉప్పుటేరు వద్ద మొగదిండి డ్రెయిన్ ఉధృతిని పరిశీలించారు. ఏటిగట్టు దిగువన పల్లపు ప్రాంతాల్లో నివాసాలను పరిశీలించారు. మాలవానితిప్పలో విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించారు. జెసి వెంట ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ సుందర్‌సింగ్, ఎంపిడిఒ స్వాతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వణికించిన గాలులు.. ఎడతెరిపి లేని వర్షం

ప్రజాశక్తి - ఆచంట
మొంథా తుపాన్ ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి నియోజకవర్గంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో 43.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈదురుగాలులతో కూడిన వర్షంతో జనజీవనం స్తంభించింది. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో ఎక్కువ మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం నుంచి తుపాన్ ఉధృతి మరింత ఎక్కువైంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి పొలాలు నేలనంటాయి. తుపాన్ తీవ్రత ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో అందరినీ అప్రమత్తం చేసినట్లు ఎంపిడిఒ బి.కృష్ణమోహన్, తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు.

వీరవాసరం: మొంథా తుపాను ప్రభావం వల్ల ఇబ్బందులు పడకుండా మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు ఆయా గ్రామాల నుండి ప్రజలు తరలొస్తున్నారు. ఈ నెల 27వ తేదీ నుండి మండలంలో జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే మొదటి రోజు పునరావాస కేంద్రాలకు రావడానికి ప్రజలు అంతగా ఆసక్తి చూపలేదు. మంగళవారం గాలులు ఉధృతంగా వీయడంతో పలువురు పునరావాస కేంద్రాలకు వస్తున్నారు. సుమారు 200 మంది పునరావాస కేంద్రాలకు చేరుకున్నట్లు తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు తెలిపారు. వీరికి సామాజిక సేవకుడు తులసి రాంబాబు భోజనాలు ఏర్పాటు చేయగా, టిడిపి నాయకులు రాయపల్లి వెంకట్ చిన్నపిల్లలకు పాలు సమకూర్చారు. పునరావాస కేంద్రాలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుందని అధికారుల అంచనా. మత్స్యపురిలో ఒక ఇంటి పైకప్పుపై చెట్టు కూలింది. సకాలంలో రెవెన్యూ పంచాయతీ అధికారుల స్పందించి కూలిన చెట్టును తొలగించారు. ఇంట్లోని వారికి ఎటువంటి ప్రమాదమూ వాటిల్లలేదు. భీమవరం నుండి వీరవాసరం వచ్చే 33 కెవి లైను కరెంటు వైర్లు తెగిపడటంతో ఉదయం నుండి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వివిధ గ్రామాల్లో చెట్లు, కరెంటు స్తంభాలు విరిగిపడటంతో వాటిని తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎంపిడిఒ వైభవతి, అధికారులు, సర్పంచి చికిలే మంగతాయారు, అధికారులు పునరావాస కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు.

తణుకు: పట్టణంలో బలమైన గాలులు వీస్తున్నాయి. ఈదురు గాలులకు రోడ్లపై చెట్లు నేల వాలుతున్నాయి. పిండి మర్ల వీధిలో రోడ్డుకి అడ్డంగా చెట్టు నేలకొరిగింది. వెంకటరాయపురం షుగర్ ఫ్యాక్టరీ వద్ద భారీ వృక్షం కూలింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి ఆ చెట్లను తొలగించారు పాతూరు ఇరగవరం రోడ్డులో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న టవర్ కిందిభాగంలో తుప్పుపట్టడంతో అక్కడే ఉన్న చెట్టుపై ఒరిగింది. సమాచారం అందుకున్న మున్సిపల్ సిబ్బంది ఆ టవర్‌ను తొలగించారు.

పోడూరు: ఈదురుగాలుల ధాటికి మండలంలోని రావిగొప్పు-రావిపాడు మార్గంలో కొబ్బరి చెట్టు విద్యుత్ తీగలపై పడటంతో రెండు స్తంభాలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పంచాయతీ, రెవెన్యూ, ఎలక్ట్రికల్ సిబ్బంది వాటిని తొలగించే పనులు చేపట్టారు.

మొగల్తూరు: పలు గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. మొగల్తూరులోని జాతీయ రహదారిపై పెద్దపలవపాలెం సమీపంలో కొబ్బరి చెట్టు నేల కూలింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

పాలకొల్లు: పాలకొల్లులో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అయితే మధ్యాహ్నం వర్షం తగ్గినా ఈదురుగాలులు బలంగా వీచాయి. మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పలుచోట్ల చెట్లు నేల కూలాయి. పట్టణంలో రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ హైస్కూల్, ఎంఎంకెఎన్‌ఎం మున్సిపల్ హైస్కూల్‌లో వీటిని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ బి.విజయసారధి చెప్పారు. మండలంలోని ఆగర్రు, వడ్లవానిపాలెం, చింతపర్రు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ చెప్పారు.

భీమవరం టౌన్: ఎడతెరిపి లేని వర్షం కారణంగా గ్రామాల్లోని రహదారులు వర్షం కారణంగా నీటి మునిగాయి. కొన్ని గ్రామాల్లో రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. నాగిడిపాలెం, కొమరాడ, లోసరి, దొంగపిండి, కొత్త పూసలమర్రు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ రాంబాబు తెలిపారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులను మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, ఎంఎల్‌ఎలు అంజిబాబు, బొమ్మిడి నాయకర్ పరామర్శించారు. పట్టణంలో ముందు జాగ్రత్తగా దుర్గాపురంలో ఒకటి, మెంటేవారితోటలో ఒకటి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు.

పెనుమంట్ర: జీవించేది కాల్వ గట్టుపైనే, మూగజీవాలను వదిలేసి పునరావాస కేంద్రానికి వస్తే వాటికి రక్షణేదీ అని కొందరు నిరాకరించిన ఘటన పొలమూరులో చోటుచేసుకుంది. ఇనచార్జి తహశీల్దార్ ఎలియమ్మ వారికి నచ్చజెప్పి వాటి రక్షణకు భరోసా తమది అని సుమారు 50 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆమె వెంట రాష్ట్ర నూర్ భాషా మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ ఆలీజిన్నా, సొసైటీ అధ్యక్షులు కండిబోయిన శ్రీనివాస్,నాయకులు ఆళ్ల జానకి రామయ్య, తోరం వెంకన్నబాబు, చింతపల్లి రామకృష్ణ ఉన్నారు. నెగ్గిపూడి రామాలయం వద్ద కొబ్బరి చెట్టు విరిగిపడి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బ్రాహ్మణ చెరువు మార్టేరు రహదారిపై బ్రాహ్మణ చెరువు వద్ద చెట్టు పడటంతో విద్యుత్తు లైన్ తెగిపడింది. ట్రాఫిక్ కూడా స్తంభించింది. నత్తారామేశ్వరం శివారు పాలి వెళ్లే రోడ్లో ఊబ చెరువు వద్ద చెట్టు విరిగిపడటంతో విద్యుత్తు లైన్‌లు తెగిపడ్డాయి. పొలమూరులో జమ్ము చెరువు గట్టున చెట్టు విరిగిపడటంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. బ్రాహ్మణ చెరువు ఇరిగేషన్ కార్యాలయం వద్ద నిద్ర గన్నేరు చెట్టు ఇరిగేషన్ కార్యాలయం పైకి నేలకొరిగింది.

ఉండి: ఎన్‌ఆర్‌పి అగ్రహారం బిసి కాలనీలోని ఒక భవంతిపై ఉన్న పిట్ట గోడ కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఉండి పెద్దపేటలో కరెంటు తీగ తెగిపడింది.

భీమవరంలో తుపాన్ షెల్టర్ నిర్మించాలి
సిపిఎం బృందం డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం
భీమవరంలో తుపాన్ షెల్టర్ నిర్మించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ బృందం పట్టణంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం పర్యటించింది. గాంధీనగర్, ప్రకాష్‌నగర్, వైఎస్ఆర్ కాలనీ ప్రాంతాల ప్రజలను పరామర్శించి స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు బయటకు వెళ్లి పనులు చేసుకునే పరిస్థితుల్లో లేరన్నారు. ఈ ప్రాంతాల్లోని పేదలకు భోజనాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. వైఎస్ఆర్ కాలనీ, ప్రకాష్‌నగర్‌లో డ్రెయినేజీ నీరు బయటకు వెళ్లే దారి లేక రోడ్లపైకి నీరు చేరి దుర్గంధం వస్తుందని, తక్షణమే మురుగునీటిని బయటకు పంపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతాల్లో వైద్య బృందాలను అప్రమత్తం చేసి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో శివారు ప్రాంతాల ప్రజలు సుమారు ఆరు వేల మంది ఉంటారని, ఇలాంటి విపత్తులు వచ్చిన సందర్భంలో వారికి పునరావాసం కల్పించడానికి తుపాన్ షెల్టర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇంట్లోంచి బయటికి వెళ్లకపోతే భృతి కరువయ్యే కుటుంబాలు భీమవరంలో చాలా ఉన్నాయన్నారు. త్వరలోనే సిపిఎం ప్రతినిధి బృందం అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి ఆ ప్రతిపాదనలను వారి ముందు పెడుతుందన్నారు. తక్షణ సహాయక చర్యలు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

నరసాపురం: మొంథా తుఫాన్ ప్రభావిత గ్రామాలైన వేములదీవి, బియ్యపుతిప్ప, చినలంక, కాపుల కొడప, పెదమైనివానిలంక గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సిపిఎం నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ పునరావాస శిబిరాల్లో ప్రజలకు అధికారులు, ఉద్యోగులు సేవలందించడం అభినందనీయమన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజలకు అంటువ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందజేయాలన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, నేతలు తెలగంశెట్టి సత్యనా రాయణ, కె.శ్రీనివాస్, కోడి లక్ష్మణ్, బూడిద జోగేశ్వరరావు, జి.ఆజాద్, వి.రామలింగం పాల్గొన్నారు.

నరసాపురం పట్టణంలో 29వ వార్డులో మురుగు కాల్వ గట్టున ఉన్న ప్రజలకు పునరావాస కేంద్రం ద్వారా ప్రభుత్వ సహకారం అందించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. స్థానిక 29వ వార్డులో మురుగుకాల్వ గట్టునున్న ప్రజలకు గొట్టుముక్కల వెంకన్న స్కూల్లో పునరావాస శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వంట, వడ్డన కార్యక్రమాలకు సిపిఎం నేతలు సహకరించారన్నారు.

తణుకు: తుపాన్ బాధితులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి ఎ.అజయకుమారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక బోయ్స్ హైస్కూల్లోని తుపాన్ బాధితులను సిపిఎం నేతలు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు బన్స్, బిస్కెట్స్, ఫ్రూటీ, వేరుశనగ ఉండలు 130 మందికి పంపిణీ చేశారు. ప్రతాప్, అజయకుమారి మాట్లాడుతూ బాధితులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలన్నారు. పునరావాస కేంద్రాలకు రాని బాధితులకు కూడా ప్రభుత్వం సాయం అందించాలని కోరారు. నేతలు గార రంగారావు, గుబ్బల గోపీ, కె.నాగరత్నం, అంబటి రామకృష్ణ, యర్రా రాజ్యలక్ష్మి, పి.హర్షిత పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నరసాపురంలో సిపిఎం నేతలు


తణుకులో..

డ్రెయినేజీలను పున: నిర్మించాలి

సిపిఎం ఆధ్వర్యాన పంచాయతీ కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి - తణుకు

వినతిని అందజేస్తున్న నేతలు

వేల్పూరు 9వ వార్డులో మురుగునీరు పారుదల లేక అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీలను తక్షణం పున: నిర్మాణం చేపట్టాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డ్రెయినేజీ పున: నిర్మాణం చేపట్టాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన పంచాయతీ కార్యదర్శి సుంకర రత్న మాలికకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ సాలిపేట 9వ వార్డు శివాలయం వీధిలో సమతం రామచంద్రరావు వీధి, కొమ్మన గంగరాజు వీధిలో ఉన్న డ్రెయినేజీలు పూర్తిగా ధ్వంసమై డ్రెయినేజీలు గుంతలు గుంతలుగా ఏర్పడడంతో శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా మారాయని, దీంతో మురుగునీరు పారుదల లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. పరిశుభ్రతగా ఉండవలసిన డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండడం వల్ల విపరీతమైన ఈగలు, దోమలు బెడదతో డ్రెయినేజీలు అపరిశుభ్రంగా మారి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు వ్యాపిస్తాయని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఈ డ్రెయినేజీల సమస్యను పరిష్కరించాలని గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాల ద్వారా ఆ ప్రాంత ప్రజలు విషయం తెలిపినప్పటికీ నేటికీ సమస్యకు పరిష్కార మార్గం చూపించకపోవడంతో తిరిగి మళ్లీ ఈరోజు సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం స్పందించి, డ్రెయినేజీలను పరిశీలించి పున: నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు కేటాయించి, ప్రజలు ఎదుర్కొంటున్న డ్రెయినేజీల సమస్యను పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శులు వాసా వెంకటేశ్వరరావు, తిరునాదం వెంకటేశ్వరరావు, చల్లా సోమేశ్వరరావు, పెన్నాడ ఆంజనేయులు, విశ్వనాథం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రెయిన్ల పరిశీలన

కాళ్ల : ఆకివీడు, కాళ్ల మండలాల నుంచి ప్రవహించే రుద్రాయికోడు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తుంది. మొంథా తుపాన్ ప్రభావంతో గత రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో డ్రెయిన్‌లోకి వర్షపు నీరు పెరగడంతో ఉండి వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ తోట ఫణిబాబు, టిడిపి మండల అధ్యక్షులు ఆరేటి వెంకట రత్నప్రసాద్(తాతా పండు) మంగళవారం పరిశీలించారు. డ్రెయిన్ నీరు వరిచేలు, ఆక్వా చెరువుల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు పెంటపాటి వెంకటనాగేశ్వరరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మంతెన కోదండ రామరాజు, దేవస్థానం చైర్మన్ ఆరేటి వీరన్నబాబు, ఆరేటి పద్మారావు పాల్గొన్నారు.

రాముకు అభినందన

గణపవరం : తుపాను బాధితులకు స్థానిక పాఠశాలలో అండగా ఉండి వారికి అన్ని సదుపాయాలు కలగచేయడానికి ముందుకు వచ్చిన కొనిశెట్టిరాము ని పలువురు అభినందించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు అత్యవసర మందులు, దుప్పట్లు, ఆహారం, తాగునీరు సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు. గణేష్ అక్షయ ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్నారని, ఈరోజు తుపాను బాధితులకు అండగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు, గణపవరం ఎంఇఒ జి.బాలయ్య, మద్దాల వెంకటేశ్వర్లు, ఎంఎల్ఎస్.నారాయణ, పుప్పాల ప్రకాష్, మద్దాల అర్జున్, కె.శ్రీనివాస్, డి.పేరయ్య, డిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు అందజేత

వీరవాసరం : వీరవాసరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఎంజెఎఫ్ లయన్ గొలగాని సత్యనారాయణ, వి.రామకృష్ణ ఆర్థిక సహకారంతో తుపాన్ బాధితులకు మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. కొణితివాడలోని 5 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 10 కేజీల బియ్యం, 10 కేజీల కూరగాయలు, ఒక దుప్పటి అందించారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పోలిశెట్టి సత్యనారాయణ(దాసు), సెక్రటరీ డి.పుల్లారావు, కో ఆర్డినేటర్ పి.శ్రీనివాస్(బాబి), లయన్స్ అందే శివశంకర్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, ఆహారం అందజేత

గణపవరం : అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక పేదలకు దుప్పట్లు, ఆహారపదార్థాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అక్షయ ఫౌండేషన్ అధినేత కొనిశెట్టి గణేష్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యాన పేదలకు సేవలందించటం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం తుపాను బాధితులకు తమ సంస్థ తరపున సొంత ఖర్చుతో వారికి కావలసిన సౌకర్యాలు అందజేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

అధ్వానమైన రహదారిని చూపిస్తున్న కాలనీ వాసులు

వర్షం వస్తే చాలు రోడ్లపై నీరు నిలిచి అనేక ఇబ్బందులు పడుతున్నామని అడ్డపుంత కాలనీ వాసులు సిపిఎం నాయకుల వద్ద వాపోయారు. తుపాను సమయంలో కాలనీ ప్రజల పరిస్థితి తెలుసుకోవడానికి వెళ్లిన సిపిఎం మండల కార్యదర్శి ఎస్కె పాదుషా మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వర్షం వస్తే ఐదు ఫర్లాంగులు నడిచి వెళ్లవలసి వస్తుందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెనుగొండ అడ్డపుంత కాలనీ ప్రజల సమస్యలు పరిష్కరించాలని పాదుషా కోరారు. కార్యక్రమంలో కుడిపూడి ప్రసాద్‌రావు, జక్కంశెట్టి రవికుమార్, కర్రి లోవరాజు, సానబోయిన శ్రీనివాసరావు, మహిళలు పాల్గొన్నారు.

వడలి కాలనీలో : తుపాన్ సందర్భంగా సిపిఎం వడలి కార్యదర్శి ఆవుల శ్రీనివాస్ వడలి కాలనీ బాధితులను పలకరించగా గత ఆరేళ్లుగా ఎటువంటి సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రోడ్లు, డ్రెయిన్లు లేవని, తాగునీరు మాత్రం అంతంత మాత్రమేనన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం వస్తే అంతా బాగుంటుందనుకున్న కాలనీవాసులకు నిరాశే ఎదురైందన్నారు. కార్యక్రమంలో గ్రంధి స్వామి అయ్యప్ప, తోట సాయి, మానే శ్రీనివాస్, కాసాని సురేష్, ఆచంట పంచముఖి పాల్గొన్నారు.

నాగమ్మ కాలనీలో : ప్రభుత్వ కాలనీలో వర్షం నీటితో ఇళ్లు మునుగుతున్నాయి. సిద్ధాంతం గ్రామం నాగమ్మ కాలనీలో ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ సందర్భంగా సిపిఎం సిద్ధాంతం గ్రామ కార్యదర్శి కప్పల రత్నరాజు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ప్రజలు అనేక అగచాట్లు పడుతున్నారని విమర్శించారు. తుపాన్ ప్రాంతంలో పేదలను పలకరిస్తూ నాగమ్మ కాలనీకి వెళ్లడంతో ప్రజలు అనేక సమస్యలు ఏకరువు పెట్టారన్నారు. ఇప్పటికైనా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రంధి రాంబాబు, కొమ్మన అచ్యుతానందం, పోలనాటి వెంకట్రావు, నక్క సత్యనారాయణ, తానేటి మందులు, పులిని సత్యవతి పాల్గొన్నారు.

పూర్తయిన పంట, మురుగు కాలువల ప్రక్షాళన

డిసి చైర్మన్ తోట ఫణిబాబు

ఉండి : తమ పరిధిలోని పంట కాలువలు, మురుగు కాలువల ప్రక్షాళన దాదాపు పూర్తయిందని ఉండి డిసి చైర్మన్ తోట ఫణిబాబు, వైస్ చైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు అన్నారు. తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో మంగళవారం ఉండి వద్ద బొండాడ డ్రెయిన్, ఉండి ప్రధాన పంట కాలువలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉండి డిసి పరిధిలో ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన శుద్ధ జలాలు అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ మైక్రో వాటర్ ఫిల్టర్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని పంపిణీ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గతంలో పంట కాలువలలోను, మురుగు కాలువలలోను గుర్రపుడెక్క, తూడు, ప్లాస్టిక్ వ్యర్థాలు మేట వేసి కాల్వలో నడిచి వెళ్లేలా ఉండేదని, దానివల్ల భారీ వర్షాలు కురిస్తే పంట పొలాలు ముంపుకు గురై రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడేదన్నారు. కానీ నేడు పంట కాలువలు, మురుగు కాలువలపై ప్రత్యేక దృష్టిసారించి ప్రక్షాళన చేయించడం వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం లేకుండా ఉందన్నారు. పంట కాలువలు, మురుగు కాలువలలో అవరోధాల తొలగింపు కార్యక్రమాలు చేయడం ద్వారా నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తలేదని, నీరు బొండాడ డ్రెయిన్ ద్వారా 22 కిలోమీటర్ల మేర ప్రవహించి ఉప్పుటేరులో కలుస్తుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, సీనియర్ నాయకులు కందుల బలరాం, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు
- పునరావాస కేంద్రాల్లో భోజనం, తాగునీరు ఏర్పాటు
- పలుచోట్ల విరిగిపడిన చెట్లు, విద్యుత్‌కు అంతరాయం
- నిరంతర పర్యవేక్షణలో అధికారులు

ప్రజాశక్తి - ఉండి

అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. ఉండి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎటువంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ భారీ వర్షాలకు బయటకు రాకుండా పురాతన భవంతులు, టవర్లు, భారీ వృక్షాల వద్ద ఉండకుండా ఇళ్లల్లోనే ఉండేలా అధికారులు గ్రామాలలో టామ్ టామ్ వేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉండి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎఎంసి చైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, వైస్ చైర్మన్ యడవిల్లి వెంకటేశ్వరరావు, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు దాసరి వెంకటకృష్ణ, మండల తహశీల్దార్ కె.నాగార్జున, ఎంపిడిఒ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి ఎస్.మురళీకృష్ణ, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన సిపిఎం నాయకులు

గణపవరం : కేశవరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం సిపిఎం మండల నాయకులు పరి శీలించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పెచ్చెట్టి నరశింహమూర్తి మాట్లాడుతూ శిథిలావస్థ ఇళ్లల్లోని ప్రజలను హైస్కూలులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారని చెప్పారు. పునరావాస కేంద్రానికి తరలించిన కుటుంబాల వారికి ప్రభుత్వం శాశ్వత ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలన్నారు. సెల్టర్‌లో ఉన్నవారిని కలిసి అధికారులు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు వేడిగా ఉండే ఆహారం, శుద్ధిచేసిన మంచినీరు అందించాలన్నారు. రోగాలు రాకుండా వైద్యస్యాకరం ఏర్పాటు చేయాలని, బాధితులుంటున్న ప్రదేశంలో బ్లీచింగ్ జల్లించాలని తెలిపారు. రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం తోపాటు ప్యానులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు దోమకాటుకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు నరాలశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తుపాన్‌తో రైతన్నలు నష్టపోకుండా వారి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇప్పటికే ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తుపాన్ నేపథ్యంలో మంగళవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ప్రజలకు, రైతులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతాంగం సుమారు 138 టన్నులు అంటే 14 నుండి 15 లారీల ధాన్యం మిల్లులకు తరలించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రసవానికి దగ్గరగా ఉన్న 13 మంది గర్భిణులను సురక్షితంగా ప్రభుత్వ ఆసుపత్రులలో చేర్చడం జరిగిందని, వారిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచామన్నారు. ఏవిధమైన అత్యవసర పరిస్థితి ఉన్నా వెంటనే క్యాంపు కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

తుపాను కారణంగా మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు మున్సిపల్ కార్యాలయంలో సెక్షన్ హెడ్స్, ఆఫీస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్నందున పునరావాస కేంద్రాల వద్ద వాటర్ సప్లై, స్ట్రీట్ లైటింగ్, జనరేటర్ ఏర్పాటు చేయవలసిందిగా ఇంజినీరింగ్ సిబ్బందికి, అలాగే మూడు డివిజన్లలో ఉన్న వార్డులలో శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి వర్షపు నీరు ఎక్కడా ఆగకుండా ఎప్పటికప్పుడు వాటర్ ఫ్లో అయ్యేవిధంగా చర్యలు తీసుకునే విధంగా ఎమర్జెన్సీ టీమ్‌ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ వైవి.వెంకటరమణ, మేనేజర్ ఎం.రవి సుధాకర్, డాక్టర్ ఎస్.రాజు, టౌన్ ప్లానింగ్, సానిటరీ, రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కూలిన చెట్లు

శ్రమదానంతో యువకుల తొలగింపు

రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షం

ఆకివీడు : ఓల్డ్ వయ్యేరు నీరు గట్టు దాటి పొంగి ప్రవహిస్తోంది. గట్టు మీద ఉన్న ఇళ్లలోకి నీరు ప్రవేశించింది. దీంతో గట్లపైన ఉన్న ఇళ్లల్లోని వారిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక విజయవాడ-భీమవరం జాతీయ రహదారిపై మండలంలోని దుంపగడప రోడ్డు వద్ద రెండు భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. చెట్లు రోడ్డుకి అడ్డంగా పడడంతో సుమారు గంటన్నరకుపైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతాల్లో పడ్డ ఈ చెట్టుని ఆర్అండ్‌బి అధికారులు తొలగించారు. అలాతీసిన అరగంటకు మరో చెట్టు కూలిపోయింది. అదే గ్రామంలో ఉన్న సుమారు 50 మంది యువకులు ఆ చెట్టుని అరగంటలో తొలగించారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లాయి.

ఎగిసిపడుతున్న ఉప్పుటేరు : ఇప్పుటేరు భారీగా పెరిగింది. గతంలో కన్నా సుమారు మూడు నుంచి నాలుగు అడుగులు ఎత్తు నీరు పెరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే అధికారిక లెక్కల ప్రకారం రెండు అడుగులుపైగానే నీరు పెరిగిందని చెప్తున్నారు. మొత్తం మీద ఉప్పుటేరు చూడడానికి భయం గొలుపుతోంది.

తణుకు : నియోజవర్గంలో భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న సహాయ చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలతో పాటు ఇరగవరం మండలంలో కాకిలేరు, ఐతంపూడి, కావలిపురం గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే తణుకు పునరావాస కేంద్రంలో 80 మందిని తరలించినట్లు తెలిపారు. ఎక్కడైనా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిస్తే తక్షణమే వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికా రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో జరుగుతున్న సహాయ చర్యలపై ఆరా తీశారు. ఆయా పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వారి యోగక్షేమాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

గణపవరం : తుపాను వల్ల మండలంలోని ప్రజలకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు గణపవరం తహశీల్దార్ వైకెవి.అప్పారావు మంగళవారం తెలిపారు. మండలంలో ఉన్న పాఠశాలలను షెల్టర్లుగా ఏర్పాటు చేశారు. అక్కడ తుపాను బాధితులకు నిత్యావసర వస్తువులు, బియ్యం, తాగునీరు అందజేసినట్లు చెప్పారు. ప్రతి సెంటర్‌కి ఒక మండలాధికారిని ఇన్‌ఛార్జిగా నియమించినట్లు చెప్పారు. అంతేకాకుండా గణపవరం, పిప్పర రహదారి మధ్యలో దారికి మధ్యగా ఒరిగి ఉన్న కొబ్బరి చెట్లను తొలగించామని తెలిపారు.

గణపవరం : బాధితులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

పునరావాస కేంద్రం పరిశీలించిన ఎంఎల్ఎ ధర్మరాజు

తుపాను ప్రభావం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం ఉం గుటూరు ఎం ఎల్ఎ పత్స మట్ల ధర్మ రాజు పరి శీలించారు. కేశ వరం హై స్కూలులో ఉన్న తుపాను బాధితులతో మాట్లాడారు. అధికారులు కలగజేసిన సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి, గ్రామసర్పంచి మిడతాని కామేశ్వరి, నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎఇ

ఆచంట : భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎలక్ట్రికల్ ఎఇ రామారావు అన్నారు. గృహోపకరణాలు స్విచ్చు ఆఫ్ మోడ్‌లో ఉంచాలని, తడి చేతులతో స్విచ్ బోర్డులను తాకరాదన్నారు. విద్యుత్ స్తంభాలు కూలినా, తీగలు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా కంట్రోల్ రూమ్‌కి తెలియజేయాలన్నారు. గాలివాన సమయంలో విద్యుత్ లైన్ల కింద నిలబడటం, కూర్చోవడం చేయరాదని, సర్వీస్ వైరు తెగితే అధికారులకు తెలియజేయాలన్నారు. వ్యవసాయ మోటర్ స్టార్టర్స్, మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు

మండలంలో సైక్‌లోన్ ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మీ, డాక్టర్లు పి.కిరణ్మయి, కె.ఓంకార్‌నాథ్ చెప్పారు. కేంద్రాలలో అత్యవసర మందులు, ఎఆర్‌వి స్నేక్ బైటా ఎఎస్‌వి ఇంజక్షన్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : తుపాను నేపథ్యంలో పెనుమంట్ర గ్రామంలో పునరావాస కేంద్రంగా హై స్కూల్ సెంటర్‌ని ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ ఎన్ఎన్‌జె.కృష్ణమూర్తి, డిప్యూటీ తహశీల్దార్ ఎలియమ్మ మంగళవారం ఇక్కడ తెలిపారు. పాత భవనాలు, పూరి, పెంకుటిల్లు లు, రేకుల షెడ్స్‌లో నివాసం ఉంటున్న వారికి అవగాహన కలిగించి, ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, బలంగా ఉన్న ఇండ్లలోకి స్థానిక అధికారులు వారిని తరలిస్తున్నారన్నారు. తుపానుకు ప్రభావితం అయ్యే ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి పునరావాస కేంద్రాలకు రావాలని సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉపసర్పంచి భూపతి రాజు శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి, విఆర్ఒ, పంచాయతీ సిబ్బంది చెప్పి అవగాహన కలిగించారు. పొలమూరులో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని పిల్లలు తుపాన్ సెలవులు ఇచ్చిన వెంటనే ఇళ్లకు వెళ్లిపోయారని ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు.

పాలకొల్లు రూరల్ : మండలంలో తుపాన్ ప్రభావంతో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. తహశీల్దార్ యడ్ల కిషోర్ పలు గ్రామాల్లో పర్యటించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి స్థానిక విఆర్ఒలను అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. స్వయంగా ఎంపిడిఒ ఉమామహేశ్వరరావుతో కలిసి పునరావాస కేంద్రాలలో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పెద మామిడిపల్లి, గోరింటాడా, ఆగర్రు, వడ్లవాని పాలెం, చింతపర్రు గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వారికి కావలసిన భోజనం ఏర్పాట్లు, మంచినీరు, వైద్య సదుపాయాలని కల్పించామన్నారు.

కాళ్ల : తుపాను ప్రభావంతో మండలంలోని శివారు ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఉప్పుటేరు తీర ప్రాంతాలైన మోడీ, గోగుతిప్ప, మేకలదిబ్బ, ఆనందపురం, మెండి, గాంధీనగర్, ఇసుకలంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. తుపాన్ ప్రభావం ఉధృతంగా ఉండే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలవపూడి హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు కాళ్ల తహశీల్దార్ జి.సుందర్ సింగ్ మంగళవారం తెలిపారు.

ఇళ్లపై విరిగిపడిన చెట్లు

ఇంటిపై పడిన వృక్షం

యలమంచిలి : వర్షంతో పాటు వీచిన పెనుగాలులకు చించినాడ గ్రామంలో జిల్లెల్ల బోసు ఇంటిపై భారీ చెట్టు పడడంతో ఆ ఇంట్లో వారంతా భయాందోళన చెందారు. అయితే ఎవరికీ ప్రాణ నష్టం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కనకాయలంక, మేడపాడు గ్రామాల్లో రహదారులపై భారీ వృక్షాలు ఒరిగిపోవడంతో తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్, ఎంపిడిఒ డివిడి.ప్రసాద్ ఆదేశాల ప్రకారం అధికారులు వెను వెంటనే చెట్లను తొలగించడం పాటు ప్రజలను అప్రమత్తం చేసే పనిలో నిమగ్నమయ్యారు. దీంతోపాటు అక్కడక్కడ కరెంటు స్తంభాలు, వైర్లు తెగిపడినా అధికారుల ముందస్తు ఆదేశానుసారం విద్యుత్తును నిలుపుదల చేయడంతో ఎవరికీ ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు

ఉండి : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని చెరుకువాడ గ్రామంలోని యానాదుల కాలనీలోని 23 కుటుంబాలకు చెందిన 68 మందిని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, మండల తహశీల్దార్ కావడి నాగార్జున మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో చెరుకువాడలోని యానాదుల కాలనీ పూర్తిగా ముంపుకు గురవుతుండడంతో పునరావాస కేంద్రానికి తరలించి వారికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, గ్రామపంచాయతీ కార్యదర్శి సుభాషిణి, గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.గొల్ల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెంచులకు పునరావాస కేంద్రం

ఆకివీడు : స్థానిక సమతానగర్లో ముంపుకు గురైన సుందరయ్య నగర్ చెంచు కాలనీలో లోతట్టు ప్రాంతంలో నివసిస్తున్న వారిని మంగళవారం రాత్రి పునరావాస కేంద్రానికి తరలించారు. రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు సంయుక్తంగా మధ్యాహ్నం వారికి హైస్కూల్ ప్రాంగణంలో భోజనాలు ఏర్పాటు చేసి మొత్తం తరలి వెళ్లవలసిందిగా సూచించారు. అయితే వారిలో ఏ ఒక్కరూ కూడా అందుకు అంగీకరించలేదు. సాయంత్రం వరకు అంగీకరించకపోవడంతో సాయంకాలం అధికారులు పోలీసుల సహకారం తీసుకున్నారు. పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సుమారు మూడు గంటలపాటు వారికి నచ్చ చెప్పారు. అయితే వారిలో తాటాకిల్లు ఉన్న వారిని మాత్రం బలవంతంగా తరలించారు. టిడిపి పట్టణ కార్యదర్శి గంధం ఉమా సత్యనారాయణ నాయకత్వంలో ఆపార్టీ కార్యకర్తలు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఫరూక్, ఆర్ఐ ఆంజనేయులు, నగర పంచాయతీ శాంట్రో ఇన్‌స్పెక్టర్ సాకేత్, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

ఆచంట : ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మధ్యాహ్నం మీడియాతో ఆయన మాట్లాడారు. అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. అవసరమైతే తప్ప ఏ ఒక్కరూ బయటికి రావద్దని, భారీ వృక్షాలు, శిథిలమైన భవనాల కింద తలదాచుకోవద్దని కోరారు. భారీవర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ప్రతీ గ్రామంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసామని చెప్పారు. తుపాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. 112 అత్యవసర సర్వీస్ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

జలమయమైన జెడ్‌పి స్కూల్

మొగల్తూరు : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు ఛిద్రమై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆ గోతులలో వర్షం నీరు నిలిచి వాహన చోదకులు ప్రమాదాలు బారిన పడ్డారు. మొగల్తూరులోని కోట రోడ్డు, పడమట పాలెం రహదారి, పేరుపాలెం కేపీ పాలెం, కాళీపట్నం గ్రామాల్లో అక్కడ డ్రెయినేజీ లేక రహదారులపైన వర్షపు నీరు నిలిచింది. మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల, పంచాయతీ పరిధి కొండావారిపాలెంలోని సంతోష్ నగర్ కాలనీ జలమయమైంది.

విద్యుత్ సరఫరా నిలిపివేత

మండలంలోని గ్రామాల్లో తుపాను ప్రభావంతో మంగళవారం ఉదయం నుండి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. భారీ గాలులు వీచి చెట్లు విద్యుత్ స్తంభాలపై పడడంతో ప్రమాదాలు సంభవించకుండా ఆ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

యలమంచిలి : మండల వ్యాప్తంగా 10 కరెంటు స్తంభాలు, 43 భారీ వృక్షాలు నేలకొరిగినట్లు తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్ తెలిపారు. వాటిని వెంటనే తొలగించటానికి చర్యలు చేపట్టారు. మొత్తం 11 పునరావాస కేంద్రాలలో 96 మందిని తరలించడం జరిగిందని, వీరిలో 41 మందికి భోజన సదుపాయం కల్పించామన్నారు.

ఆకివీడు : మండలంలో భారీస్థాయిలో ఈదురుగాలుల ప్రభావంతో పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఉప్పుటేరు మలుపు వద్ద, స్థానిక జానకమ్మ ఆసుపత్రి వద్ద, తాళ్లకోడు 220 కెవి సబ్ స్టేషన్ వద్ద భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడిన ప్రభావంతో కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోయాయి. స్తంభాలు నేలకొరిగాయి. ఫలితంగా మండలంలో మూడువంతులు విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రాత్రి 8:30 నుండి టివి ప్రసారాలకు తీవ్ర అంతరాయం కలిగింది. కేబుల్ నెట్వర్క్ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

నరసాపురంలో రోడ్డుపై పడిన వృక్షం

నరసాపురం : మండలంలోని బియ్యపుతిప్ప, వేములదివి ఈస్ట్, వేములదివి వెస్ట్, పిఎం లంక, చినలంక పరిసర గ్రామాలను ఎంఎల్ఎ నాయకర్, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ చదలవాడ నాగరాణి, టిడిపి ఇన్‌ఛార్జి పోత్తూరి రామరాజులతో కలిసి సందర్శించారు. డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, రాష్ట్ర మత్స్యశాఖ సహకార సంఘాల చైర్మన్ కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు.

మండలంలోని వేములదీవి తూర్పులో తుపాన్ పునరావాస కేంద్రాన్ని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో బాధితులకు అందుతున్న తాగునీరు, ఆహారం, వసతి, విద్యుత్ సరఫరా, వైద్య సహాయం, చిన్నారులకు పాలు, పారిశుధ్య నిర్వహణ గురించి బాధితుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఆర్‌డిఒ దాసిరాజు ఉన్నారు.

ఎల్‌బి చర్ల గ్రామంలోని చింత చెట్టు మలుపు వద్ద చింత చెట్టు నేలకూలింది. ఈ ప్రాంతంలో రోడ్డుపై పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు, విద్యుత్ తీగలపై పడి పోవడం, రోడ్డుపై చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగింది. పట్టణంలోని 12వ వార్డు పార్క్ రోడ్, సాయిబాబా గుడి వెనుక 6 భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. సీతారామ పురం -పేరుపాలెం ఆర్ అండ్ బి రోడ్డుపై భారీ సర్వే వృక్షాలు నెలకొరిగాయి. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సుమారు గంటపాటు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు సహాయంతో సిఐ దుర్గా ప్రసాద్, రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ తొలగించారు.

నియోజకవర్గంలోని సముద్రంలో రాకాసి అలలు ఎగిసి పడుతున్నాయి. మంగళవారం సముద్రం ముందుకు వచ్చింది. తీర ప్రాంత గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. పలు గ్రామాల్లో సెల్ సిగ్నల్స్ పనిచేయడం మానేసాయి. ఇన్వెర్టర్ సైతం ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రైతులు ఆందోళన చెందొద్దు

వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందొద్దని భీమవరం ఎడిఎ కె.శ్రీనివాసరావు తెలిపారు. గరగపర్రులో మంగళవారం పాలకోడేరు వ్యవసాయాధికారి బి.సంధ్యతో కలిసి పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎడిఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండడం ద్వారానే పంటలో నష్టాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. పొలాల్లో నీరు నిలవ లేకుండా చూసుకోవాలని చెప్పారు. చేలు నేలకు ఒరిగితే వాటిని పైకి లేపి కట్టలుగా కట్టుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయాధికారి సంధ్య మాట్లాడుతూ మండలంలో 200 ఎకరాల్లో వరి పంట ముంపు బారిన పడిందని తెలిపారు. గింజలు మొలక రాకుండా కల్లుప్పు ద్రావణాన్ని వరి చేలుపై పిచికారీ చేయాలని సూచించారు.

పాలకోడేరు : రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ

వీరవాసరం : రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని వీరవాసరం డిసి చైర్మన్ ఆకుల లీలాకృష్ణ అన్నారు. మంగళవారం జిఅండ్‌వి కాలువ ఉధృతిని ఆయన పరిశీలించారు. ముందస్తు చర్యల్లో భాగంగా నీటి సంఘాల్లో ప్రెసిడెంట్లను, డిసి చైర్మన్ సంబంధిత అధికారులను సిద్ధంగా ఉండాలని, అలాగే ఇరిగేషన్, డ్రెయిన్స్‌కు సంబంధించిన కాల్వ గట్టులను పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం జిఎన్‌వి కెనాల్ గట్టును, వీరవాసరం పశ్చిమ కాలువ గట్టును పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

ఉండి: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని ఉప్పులూరు గ్రామంలోని పంట పొలాలను మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత దశలో ఉన్నట్లయితే వెంటనే పంట పొలంలోని నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. పంట పడిపోయిన చోట పంటను నిలబెట్టి జతకట్టాలన్నారు. పంట దుబ్బు దశలో ఉన్నట్లయితే ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాస్ చల్లాలని, ఇలా చేయడం వల్ల పంట నష్టాలను నివారించేందుకు వీలవుతుందన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, కోమర్రు గ్రామం, కొల్లి నాగేశ్వరరావు గారి కుమారుడు, కొల్లి వెంకట సత్యనారాయణ అను నేను ఇల్లు మారినప్పుడు ఖాతానెం.200రు నందు రీసర్వేనెం.115-1రు లో య.0.88ట్లున్నూ, రీసర్వే నెం. 127రులో య.1.07ట్లున్నూ, రీసర్వే నెం. 1424రులో య.0.68ట్లు ఆస్థి గల పాసుపుస్తకం మరియు టైటిల్ డీడ్‌ను తీసుకొని ది. 20-10-2025 తేదీన ముదినేపల్లి గ్రామంలో జిరాక్స్ తీయుంచుటకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా నా యొక్క పాసుపుస్తకం మరియు టైటిల్ డీడ్ ఎక్కడో జారిపోయినవి. ఎంత వెదికినా దొరకలేదు. దొరికిన వారు యీ క్రింది అడ్రస్సుకు పంపించగలరు. పంపిన వారికి తగిన పారితోషకం అందించబడుతుంది. వీటిని ఉపయోగించి ఎటువంటి లావా దేవీలు జరిపిననూ, జరిపినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

కొల్లి వెంకట సత్యనారాయణ
తండ్రి: నాగేశ్వరరావు, డోర్ నెం.2-58
కోమర్రు, ముదినేపల్లి మండలం ఏలూరుజిల్లా
సెల్ నెం. 94903 38172

మహారాజశ్రీ 3వ అదనపు (మొబైల్) జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఏలూరు
ఓ.యస్.నెం.360/2025

బిట్వీన్:-
శ్రీమతి. మానేపల్లి మమతా విశాలాక్షి ...పిటీషనర్/వాది
మరియు
శ్రీ కె.హెచ్.యల్.యస్.యస్.వి. మురళీ నాగరాజు యలియాస్ మురళీ రాజ్ ...రెస్పాండెంట్

పిటీషనరు/వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో రెస్పాండెంటు అయిన శ్రీ. కె.హెచ్.యల్.యస్.యస్.వి. మురళీ రాజ్, తండ్రి: రామచంద్రరావు, డోర్.నెం. 4-20-30, అగ్రహారం, ఏలూరు-1, ఏలూరు జిల్లా అను వారికి **ది. 12-11-2025వ తేది ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియ పర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు దావాను తమ పరోక్షమందు విచారించి తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

గెళ్ళ శ్రీనివాసరావు
గెళ్ళ సాయి అనూష
అడ్వకేట్స్, ఉప్పు వారి వీధి, ఎన్.ఆర్.పేట్, ఏలూరు
ఏలూరు
ది.28-10-2025

IN THE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE, TANUKU
O.S.No. 62/2016

Between:
Muppidi Kotamma and another ...**Plaintiffs**
And
The District Collector and others ...**Defendants**

వాది తరపున చేసిన ప్రకటన

12 వ ప్రతివాది:
కర్రి మంగమ్మ, W/o. వెంకటరెడ్డి, స్త్రీ, గృహిణి, D.No: 14-13-2, ఓగిడి గ్రామం, పెనుమంట్ర మండలం.

పై నెంబరు దావా గ్రంధములో 12 వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ, మీకు అమలు జరగనందున, శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 31-10-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేయవలసినది గాను, అట్లు కాని యెడల శ్రీ కోర్టు వారు పై నెంబరు దావా గ్రంధమును మీ పై పరోక్షమున తీర్మానించుదురని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

Kamarsu Srinivasa Rao
IDL Kiranmai
Advocates, Tanuku
Tanuku
Dt. 28-10-2025
Cell: 9346761569, 9701784630